సాక్షి
వికారాబాద్

శుక్రవారం । 24 । ఫిబ్రవరి । 2023



శాంతిభద్రతలు ఏకపక్షం

తాండూరులో శాంతిభద్రతలు లోపించాయనే విమర్శలు చెలరేగాయి. ఇటీవల జరిగిన ఘటనలు తేటతెల్లం చేస్తున్నాయి. 10లో▸



సమస్యలపై పోరాడుతాం

వైఎస్సార్ టీపీ ఎల్లప్పుడూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుందని ఆ పార్టీ నాయకుడు కోళ్ల యాదయ్య అన్నారు. 10లో▸



వేతనం అందక వెతలు

జిల్లాలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు వేతనాలు సకాలంలో అందక బతుకులు దుర్భరంగా మారాయి. 11లో▸

న్యూస్‌రీల్

రుణాలు సద్వినియోగం చేసుకోండి

జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ రాంబాబు



మాట్లాడుతున్న లీడ్‌బ్యాంక్ మేనేజర్

దౌల్తాబాద్: మహిళలు బ్యాంకు రుణాలను తీసుకుని సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థికంగా ఎదగాలని జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ రాంబాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో బుక్ కీపర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మహిళా సంఘాలను బలోపేతం చేయాలని ఐకేపీ సిబ్బందికి సూచించారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని కోరారు. అలాగే బాలంపేటలోని ఏపీజీవీబీ బ్యాంకును పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఎం సాయన్న, సీసీలు, బుక్‌కీపర్లు ఉన్నారు.

అడవిలోకి అగ్గికారక వస్తువులు నిషేధం

ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్‌ఓ కృష్ణ

ధారూరు: అడవిలోకి ఎవరూ అగ్గి కారక వస్తువులు తీసుకెళ్లరాదని ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్‌ఓ కృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేసవిలో ఎవరైనా తెలిసి, తెలియక అగ్గి రాజేస్తే అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. అడవిలో అగ్గిపెట్టెలతో తిరగరాదని ఆయన సూచించారు. అడవిలో ఎక్కడైనా మంటలు వ్యాపిస్తే వెంటనే 91779 10478 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. రేంజ్ పరిధిలోని అడవిలో కలప, ఇసుక అక్రమ తరలింపుపై గట్టి నిఘా ఏర్పాటు చేశామని, రాత్రిళ్లు సిబ్బంది ద్వారా నైట్ పెట్రోలింగ్ చేయిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసులపై నిర్లక్ష్యం వద్దు

ఎస్పీ కోటిరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: మహిళా సంబంధిత ఎస్సీ, ఎస్టీ కేసుల్లో నిర్లక్ష్యం తగదని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం ఎస్పీ కార్యాలయంలో కేసులపై సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో జరిగే కేసుల పట్ల ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కేసులు నమోదయిన వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. అధికారులు నేరస్థలం పరిశీలించి, బాధితులకు రక్షణ కల్పించాలన్నారు. పోక్సో కేసులు, ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు ఆర్థిక సహాయం కోసం సంబంధిత పత్రాలను కలెక్టరేట్‌కు చేర్చాలని తెలిపారు.

నర్సరీల్లో పనితీరు మెరుగుపడాలి

డీఆర్‌డీఓ కృష్ణన్



యాచారం నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ కృష్ణన్

బంట్వారం: నర్సరీ పనుల్లో నిర్లక్ష్యం తగదని డీఆర్‌డీఓ కృష్ణన్ ఈజీఎస్ సిబ్బందిని హెచ్చరించారు. గురువారం ఆయన బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లోని యాచారం, నూరుల్లాపూర్, కంకణాలపల్లి, జిన్నారం, ఎన్నారం, రాంపూర్ నర్సరీలను సందర్శించి మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాంపూర్ మినహా నర్సరీలు ఎక్కడా బాగాలేవని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతటా పని తీరు మెరుగుపడాలన్నారు. ఒక్కో నర్సరీలో ఐదు వేలకు తగ్గకుండా మొక్కలను పెంచాలన్నారు. ఎప్పటికప్పుడు నీరు పట్టాలన్నారు. అనంతరం ఆయన ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో బంట్వారం ఎంపీడీఓ బాలయ్య, ఎంపీఓ విజయ్‌కుమార్, ఏపీఓ సుధాకర్, ఈసీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

పన్ను.. వసూలుపై కన్ను

జిల్లా పంచాయతీ విభాగం పన్నుల వసూలులో దూకుడు ప్రదర్శిస్తోంది. ఆర్థిక సంవత్సరం ఇంకా నెల రోజులు మిగిలి ఉండగానే టార్గెట్‌కు చేరువయ్యాయి. గత నెల 50 శాతం వసూళ్లకే పరిమితమైన యంత్రాంగం దూకుడు పెంచడంతో త్వరగా టార్గెట్‌కు చేరువైంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ, నిరంతర సమీక్షలు, అందుబాటులో పంచాయతీ కార్యదర్శులు తదితర సానుకూల అంశాలు పన్నుల వసూలులో పురోగతి సాధించటానికి దోహదం చేశాయి. ఇతర శాఖలపై పర్యవేక్షణ, పనివత్తిడి ఉన్నప్పటికీ కార్యదర్శులు పన్నుల వసూళ్లలో మంచి పురోగతి సాధించారు.



పన్ను వసూలు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

దూకుడు పెంచిన పంచాయతీ విభాగం

- ఇప్పటికే 81 శాతం టార్గెట్ పూర్తి
- జిల్లాలో గ్రామ పంచాయతీలు: 566
- నివాస గృహాలు: 1,85,657
- ఈ ఆర్థికసంవత్సరం లక్ష్యం రూ.7.7 కోట్లు
- ఇప్పటి వరకు వసూలు చేసిన మొత్తం: రూ. 6.2 కోట్లు

వికారాబాద్: జిల్లాలోని గ్రామపంచాయతీల్లో పన్నుల వసూలు ముమ్మరంగా సాగుతోంది. ఆర్థిక సంవత్సరం (2022–23) ఇంకా నెల ఉండగానే లక్ష్యంలో 81 శాతం మేర వసూలు చేయడం గమనార్హం. జిల్లాలో 566 గ్రామ పంచాయతీలు ఉండగా 1,85,657 నివాసాలు ఉన్నాయి. పంచాయతీలు, మండలాల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.7,70,31,224 పన్నులు వసూళ్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో ఇళ్ల పన్ను రూపంలో రూ. 7,12,70,281 కాగా నాన్ ట్యాక్సెస్ ద్వారా రూ.5,76,0943 వసూలు చేయాలన్నది లక్ష్యం. ఇందులో ఇప్పటి వరకు నాన్ ట్యాక్సెస్‌కు సంబంధించి రూ. 4,73,4377 అంటే టార్గెట్‌లో 82 శాతం వసూలు చేశారు. ట్యాక్సెస్ రూపంలో రూ. 6,57,55,6409 అంటే 80.76 శాతం పన్నులు వసూలు చేశారు. ట్యాక్సెస్, నాన్ ట్యాక్సెస్ రెండు కలిపి ఓవరాల్‌గా జిల్లాలో 81 శాతం పన్నుల వసూళ్లు పూర్తయ్యాయి. అయితే లక్ష్యంలో కొడంగల్ మండలం 95 శాతం, వికారాబాద్ 94 శాతం, ధారూరు 93 శాతం వసూళ్లతో ముందు వరుసలో ఉండగా యాలాల 69 శాతం, తాండూరు, బషీరాబాద్ మండలాలు 71 శాతం పన్నుల వసూళ్లలో కాస్త వెనకబడి ఉన్నాయి.

అన్ని అనుమతులు ఆన్‌లైన్‌లోనే..

జీపీల సేవల్లో పారదర్శకత కోసం అన్ని ఆన్‌లైన్ చేస్తామంటూ చెబుతూ వస్తున్న ప్రభుత్వం ఎట్టకేలకు అన్ని రకాల అనుమతులు ఆన్‌లైన్ విధానంలోకి తీసుకువచ్చింది. మొదట్లో కేవలం ఇళ్ల అనుమతులకు మాత్రమే ఆన్‌లైన్ సేవలందిస్తూ మిగతా అన్ని రకాల సేవలు ఆఫ్ లైన్‌లోనే కొనసాగిస్తూ వచ్చారు. ప్రస్తుతం అన్ని రకాల సేవలు ఆన్‌లైన్ ద్వారానే అందిస్తున్నారు. గ్రామ పంచాయతీల వారీగా ఈ టార్గెట్ విధించుకుని పన్నుల వసూళ్ల రూపంలో నిధులు సమకూర్చుకుంటారు. ప్రధానంగా ఇంటి పన్నులు పంచాయతీల రాబడిలో సింహభాగం ఉంటాయి. ఈ విషయంలో 80.76 శాతం వసూళ్లతో కాస్త వెనకబడి ఉన్నారు. ఇక నాన్ ట్యాక్సుల వసూళ్లలో 82.18 శాతం వసూలు చేశారు. ఇళ్ల అనుమతులు, జరిమానాలు, సంతల్లో తైబజార్ ద్వారా వచ్చే రాబడులు, వ్యాపార సముదాయాలకు విధించే జరిమానాలు, పన్నులు, అనుమతులు తదితర సేవల ద్వారా గ్రామ పంచాయతీలకు సమకూరే నిధులను నాన్ ట్యాక్సుల కింద లెక్కిస్తారు. అయితే ఇంటి పన్నుల వసూళ్లలో పారదర్శకత బాగానే కనిపిస్తుండగా నాన్ ట్యాక్సెస్ వసూళ్ల విషయంలో చాలా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వ్యాపారుస్తులతో లోపాయికారిగా వ్యవహరిస్తూ ఫాంహౌస్‌లు, వ్యాపార సముదాయాలకు పన్నులు సక్రమంగా విధించడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వసూళ్ల విషయంలోనూ అంతంతగానే చొరవ చూపుతున్నారనే ఆరోపణలున్నాయి.

వంద శాతం వసూలు చేస్తాం



జిల్లాలో పన్నుల వసూలు 80 శాతం దాటింది. నాన్ ట్యాక్సుల వసూళ్ల విషయంలో కాస్త వెనకబడి ఉన్న మాట వాస్తవమే. అయితే త్వరలో వంద శాతం పన్నులు వసూళ్లే లక్ష్యంగా పని చేస్తున్నాం. ప్రజలు పన్నులు సక్రమంగా చెల్లించిన ప్పుడే నాణ్యమైన సేవలు అందుతాయి. ఇదే సమయంలో జవాబుదారితనం, భాగస్వామ్యం కూడా పెరుగుతుంది.

– తరుణ్‌కుమార్, డీపీఓ, వికారాబాద్



యాచారంలోని ఓ ఇంటి ఎదుట వీధి కుక్కలు

భౌబోయ్..!

- వీధి కుక్కల విహారంతో జనం బెంబేలు

యాచారం: వీధి కుక్కలు వీరవిహారం చేస్తున్నాయి. వాటిని చూసి జనం బెంబేలెత్తిపోతున్నారు. యాచారం మండలంలో రెండు నెలల వ్యవధిలో 808 పైగా కేసులు నమోదవడం చూస్తుంటే పరిస్థితి తీవ్రతను అద్దం పడుతోంది. కుక్కలు కనిపిస్తే చాలు ప్రజలు భయాందోళనతో పరుగులు తీస్తున్నారు. వీధి కుక్కల బారి నుంచి తమను కాపాడాలని జనం కోరుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఈ ప్రాంతంలో 1,500లకు పైగానే వీధి కుక్కలున్నట్లు అధికారులు అంచనా వేశారు. యాచారంలో గురువారం ఓ పిచ్చి కుక్క దొరికిన వారిని దొరికినట్లు పది మందిని తీవ్రంగా గాయపర్చడం కలకలం సృష్టించింది. మండలంలోని నందివనపర్తి, యాచారం, తమ్మలోనిగూడ, మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి, తక్కళ్లపల్లి, గునుగల్, గడ్డమల్లయ్యగూడ, నక్కర్తమేడిపల్లి తదితర గ్రామాల్లో వందలాది పౌల్ట్రీఫాంలు ఉన్నాయి. మృతి చెందిన కోళ్లను యజమానులు సరైన జాగ్రత్తలు తీసుకోకుండానే వ్యవసాయ పొలాల్లో పడేస్తున్నారు. వాటిని తింటున్న కుక్కలు రక్తం రుచి మరిగి వీరవిహారం చేస్తున్నాయి. కోళ్ల మాంసం దొరకని సమయంలో ఆవులు, దూడలు, ఆవులు, గొర్రెలపై దాడులు చేస్తున్నాయి. ఏడాది కాలంలో వీధి కుక్కల దాడుల్లో వందలాది మూగజీవాలు మృత్యువాతకు గురైన దాఖలాలు ఉన్నాయి. ప్రస్తుతం కుక్కలు ప్రజలపై దాడులు చేస్తు తీవ్రంగా గాయపర్చుతున్నాయి. పౌల్ట్రీఫాంలోని కోళ్లకు పలు రకాల ఇంజక్షన్లు ఇస్తుండటం వల్ల వాటి ప్రభావంతో పిచ్చి లేస్తూ గ్రామాల్లో సంచరిస్తున్నాయి. పౌల్ట్రీ యాజమాన్యాలతో కుమ్మక్కవుతున్న పంచాయతీ కార్యదర్శులు సరైన కట్టడి చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



యాచారంలో పిచ్చి కుక్క దాడిలో గాయపడిన యువకుడు

ఇష్టానుసారంగా పడేస్తే చర్యలు

పౌల్ట్రీఫాంల యజమాన్యాలు మృతి చెందిన కోళ్లను ఇష్టానుసారంగా పడేస్తే చర్యలు తప్పవు. మృతి చెందిన కోళ్లను గుంతలు తీసి అందులో వేసి పూడ్చడమా.. లేదా ఇతర జాగ్రత్తలు తీసుకుని పొలాల్లో కనిపించకుండా చూసుకోవాలి. ఆయా గ్రామాల్లో ఉన్న యజమాన్యాలకు నోటీసులు జారీ చేస్తాం. వీధి కుక్కల కట్టడిపై చర్యలు తీసుకుంటాం. ప్రజలు జాగ్రత్తగా ఉండాలి.

– విజయలక్ష్మి, ఎంపీడీఓ యాచారం

మీ ఉప్పులో అయోడిన్ ఉందా?



ఉప్పును పరీక్ష చేస్తున్న డాక్టర్ శివశంకర్

- ఇంటింటా సేకరించిన ఉప్పును పరీక్షించిన వైద్యుడు
- ఐయోడిన్ లోపంపై అవగాహన

ధారూరు: మనం నిత్యం వివిధ వంటకాల్లో, ఇతర వాటిలో వాడుతున్న ఉప్పులో ఎంతమేర అయోడిన్ శాతం ఉందనేది నిర్ధారించి అవగాహన కల్పించారు. ధారూరు మండలం కుక్కింద ఉన్నత పాఠశాలలో గురువారం ఈ పరీక్ష నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి తీసుకువచ్చిన ఉప్పును పరీక్ష చేసి అయోడిన్ ఉందా లేదా అనేది నిర్ధారించారు. నాగసమందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధ్వర్యంలో అయోడిన్ టెస్టు చేశారు. విద్యార్థుల్లో అయోడిన్ టెస్టుతో పాటు విద్యార్థుల నుంచి యూరిన్ టెస్టు కూడా నిర్వహించామని డాక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. పరీక్షించిన ఏ విద్యార్థిలోనూ అయోడిన్ లోపం లేదని చెప్పారు. విద్యార్థుల్లో ఎవరైనా బుద్ధిమాంద్యంతో ఉన్నారా? ఒబెసిటి ఉందా? వారి ఇళ్లలో ఎవరైనా గర్భవతులుంటే వారిలో ఎవరైనా అయోడిన్ లోపంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారా? వంటి విషయాలపై డాక్టర్ ఆరా తీసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫిమేల్ ఎంపీహెచ్‌ఎస్ ఉమా, ఎఫ్‌సీ ఏఎన్ఎం మహబూబ్‌బీ, సెకండ్ ఏఎన్ఎం అంజలి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ను విస్తరించాలి



కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు తదితరులు

చేవెళ్ల: తెలంగాణ ప్రభుత్వం ప్రజలందరికీ కంటి సమస్యలను దూరం చేసేందుకు నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరికీ అందేలా సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఈ. వెంకటేశ్వర్‌రావు అన్నారు. చేవెళ్లలోని గ్రామ పంచాయతీ వద్ద జరుగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆయన వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, డీసీహెచ్‌ఎస్ వరదాచారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కంటివెలుగు శిబిరానికి వస్తున్న ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కంటి సమస్యలు ఎలా ఉన్నాయి. వాటిని ఎలా పరిష్కరిస్తున్నారని వైద్యసిబ్బందిని అడిగారు. కంటి సమస్యలున్నవారికి కంటి అద్దాలు అందించాలని సూచించారు. మండలకేంద్రంలో ఉన్న కమ్యూనిటీ ఆస్పత్రిలో ప్రజలకు 24 గంటల పాటు వైద్య సేవలు అందుబాటులోఉండాలని పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యావిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ ఆదేశించారు. చేవెళ్లలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిని ఆయన డీసీహెచ్‌ఎస్ వరదాచారి, డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్ రావుతో కలిసి గురువారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వైద్యులు, వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులకు సరైన వైద్యం అందిస్తామనే నమ్మకం కలిగించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ సోమశేఖర్‌గౌడ్, డాక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి, వైద్యులు, స్టాఫ్‌నర్సులు, నర్సులు, సిబ్బంది ఉన్నారు.

దారిమళ్లింపుతో అవస్థలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం నుంచి తాండూరు వెళ్లే ప్రధాన రోడ్డులో రైల్వేగేట్ వద్ద పట్టాల మరమ్మతులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం, గురువారం రెండు రోజుల పాటు ఆ దారి గుండా వెళ్లే వాహనాలను రామయ్యగూడ మీదుగా బుగ్గ, కెరెల్లి మీదుగా మళ్లించారు. దీంతో అనంతగిరి, తాండూరు వెళ్లే వాహనాలన్నీ రామయ్యగూడ దారి గుండా వెళ్లడంతో ఆ రోడ్డంతా రాకపోకలతో రద్దీగా మారింది. గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. వాహనదారులు అవస్థలకు గురయ్యారు. ఎట్టకేలకు పనులు పూర్తికావడంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.



స్తంభించిన ట్రాఫిక్

ఇద్దరు అధికారుల సస్పెన్షన్

- ఎంపీఓకు మెమో జారీ
- కలెక్టర్ నారాయణరెడ్డి చర్యలు
- విధుల పట్ల నిర్లక్ష్యమే కారణం
- ఇక నుంచి ప్రతిగ్రామాన్ని సందర్శిస్తా
- అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దంటూ హెచ్చరిక

దోమ : ‘ఇక నుంచి ప్రతి గ్రామాన్ని సందర్శిస్తా.. అభివృద్ధి పనులు వేగిరం చేయాలి.. నాణ్యత లోపించవద్దు.. అధికారులు విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవు’ అని కలెక్టర్ నారాయణరెడ్డి స్పష్టం చేశారు. దోమ మండలంలో విధుల్లో అలసత్వం ప్రదర్శించిన ఇద్దరు అధికారులను సస్పెన్షన్ చేశారు. అంతేకాకుండా మరో ముగ్గురికి జరిమానా విధించారు. ట్రైనీ కలెక్టర్ సంచిత్‌గంగ్వార్‌తో కలిసి ఆయన గురువారం మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. ముందుగా మండల పరిధిలోని దోర్నాల్‌పల్లిలో తిరుగుతూ పరిసరాలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీ, పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డ్, క్రిమిటోరియం పనులపై ఆరా తీశారు. నర్సరీ నిర్వహణ అధ్వానంగా ఉండడమే కాకుండా అందులో మొక్కలకు నీరందించకపోవడంతో మొక్కలు ఎండిపోయాయి. దీంతో ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి సురేశ్, టెక్నికల్ అసిస్టెంట్ నారాయణరెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సస్పెండ్ చేశారు. గ్రామాల్లో పనుల పురోగతిపై పర్యవేక్షించాల్సిన ఎంపీఓ సోమలింగం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై మెమో జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. నర్సరీలో మొక్కలు ఎండిపోవడం, వాటి స్థానంలో మళ్లీ ఏర్పాటు చేయకపోవడంపై ఏపీఓ దస్తయ్యకు రూ.20 వేలు, టీఏ నారాయణరెడ్డికి రూ.10 వేల జరిమానా విధించారు. పంచాయతీ నిర్వహణ బాగా లేదని కార్యదర్శి సురేశ్‌కు రూ.15వేలు, అలాగే నర్సరీని పట్టించుకోకపోవడంతో మరో రూ.పది వేలు జరిమానా విధించారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటంపై ఎంపీడీఓపై అసహనం వ్యక్తం చేశారు.

పనిచేయని సర్పంచ్‌లపైనా దృష్టి

జిల్లా వ్యాప్తంగా గ్రామాలలో పని చేయని సర్పంచ్‌లపైనా చర్యలు తప్పవని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. జాతీయ ఉపాధిహామీ పథకంలో వివిధ రకాల అభివృద్ధి పనులు చేయాల్సి ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఇక నుంచి ప్రతి గ్రామాన్ని సందర్శిస్తానన్నారు.



దోర్నాల్‌పల్లిలో నర్సరీ నిర్వహణ అధ్వానంగా ఉండటంతో పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

చదువే ఏకైక ఆయుధం

దోర్నాల్‌పల్లి పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడుతూ సెలబస్‌ను అడిగి తెలుసుకున్నారు. హాజరు శాతాన్ని పరిశీలించారు. బోర్డుపై రాయించి వారి వారి సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు చదువే ఏకైక ఆయుధమని, శ్రద్ధగా చదువుకొని ప్రయోజకులు కావాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

- ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ఇష్టారాజ్యం
- మధ్యాహ్నం 12 దాటినా ఖాళీ కుర్చీలే దర్శనం
- కానరాని జియో యాప్ హాజరు

తాండూరు రూరల్: తాండూరులో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల తీరు చర్చనీయాంశంగా మారింది. ఓ పక్క కలెక్టర్ నారాయణరెడ్డి సమయ పాలన పాటించాలని, జియో యాప్ ద్వారా అటెండెన్స్ వేయాలని సూచిస్తుంటే.. అధికారులు మాత్రం కలెక్టర్ ఆదేశాలను బేఖాతర్ చేస్తుండటం గమనార్హం. మధ్యాహ్నం 12 గంటలు దాటినా ఏ అధికారి రాకపోవడం కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రణిత్ చాలా కాలంగా కార్యాలయానికి రావడంలేదనే ఆరోపణలున్నాయి. అంతేకాకుండా వేసవి సమీస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలి. కానీ ఆ దిశగా చర్యలు చేపట్టడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఏఈ ప్రణయ్ హైదరాబాద్‌లో ఉంటూనే స్థానికంగా ఉన్నానంటూ.. ఇంకోసారి వికారాబాద్ కార్యాలయంలో ఉన్నానంటూ చెబుతుండటం గమనార్హం. సమస్యలు విన్నవించుకుందామంటే ఏ అధికారి అందుబాటులో ఉండటంలేదని స్థానికులు వాపోతున్నారు.



మధ్యాహ్నం 12 గంటలు అవుతున్నా ఖాళీగా దర్శనం ఇస్తున్న కుర్చీలు

క్లుప్తంగా

గ్రామకంఠం భూమిని కాపాడండి

కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మల్లన్న

దోమ: గ్రామ కంఠం భూమిలో ప్లాట్లు చేసిన కొంతమంది రియల్టర్లు వీటిని యథేచ్ఛగా విక్రయిస్తున్నారని బహుజన సమాజ్ పార్టీ మండల ఇన్‌చార్జ్ గార్లపల్లి మల్లన్న తెలిపారు. గురువారం దోమ మండల కేంద్రానికి వచ్చిన కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. మండల పరిధిలోని ఐనాపూర్‌లో సుమారు ఎకరం ఇరవై గుంటల గ్రామ కంఠం భూమి ఉందని తెలిపారు. దీన్ని ఆక్రమించిన భూ వ్యాపారులు ప్లాట్లు చేసి అమ్ముకుంటున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శికి చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. సదరు భూమిని కాపాడాలని కలెక్టర్‌కు విన్నవించారు. వినతిపత్రం స్వీకరించిన కలెక్టర్ పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మేకల కాపరిపై దాడి: నలుగురిపై కేసు నమోదు





దాడిలో గాయపడిన నర్సింలు

మోమిన్‌పేట: పత్తి పొలంలో మేకలు మేసాయని ఓ వ్యక్తిని చితక బాదిన సంఘటన మోమిన్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని అంరాధిఖుర్దు గ్రామానికి చెందిన ఎంకమోళ్ల నర్సింలు మేకలు బుధవారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన సాలే రవి, మార్కండేయ, సంగమేశ్, సుజాతల పత్తి పొలంలో మేశాయి. దీంతో గురువారం ఉదయం పైనలుగురు నర్సింలుపై కర్రలతో దాడి చేశారు. తీవ్ర గాయాలైన నర్సింలు పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్ ప్రకాష్ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

షాబాద్/షాదీషరీఫ్: అక్రమంగా తరలిస్తున్న 13 టన్నుల రేషన్ బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 11 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. తుక్కుగూడ మార్కెట్ వెనుక రేషన్ బియ్యాన్ని లారీలోకి నింపుతున్నారన్న సమాచారం అందుకున్న పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ పఠాన్ హైదర్ అలీఖాన్ పహాడీషరీఫ్ పోలీసుల సహకారంతో గురువారం ఉదయం దాడులు నిర్వహించారు. పారిపోయేందుకు యత్నించిన జితేంద్ర నాయక్(28), ఇష్వాలాల్ సాహు(35), ఇమాన్యల్ సాహు (20),వినోద్ చౌహాన్(22), అనిల్ చౌహాన్(24), అఫ్తాబ్ ఆలం(25), షేక్ అక్తర్(27), షేక్ సిల్దార్(25), మహ్మద్ వకీల్(30), మహ్మద్ గుల్ఫ్ రాజ్(30), మహ్మద్ తాజ్(30)లను అదుపులోకి తీసుకున్నారు. సులభంగా డబ్బు సంపాదించేందుకు నగర శివారులోని రేషన్ కార్డు లబ్ధిదారుల వద్ద కిలో రూ. 5లకు కొనుగోలు చేసి ఆదిలాబాద్‌కు చెందిన షేక్ అబ్దుల్ యాసర్ సల్మాన్ ద్వారా కర్ణాటకలో రూ. 12కు కిలో చొప్పున విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. మొత్తం 282 బ్యాగుల్లో 13 టన్నుల బియ్యం బస్తాలను, లారీ, తొమ్మిది సెల్‌ఫోన్లు, రూ. 1330ల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పోలీసులు ఏకపక్షం

ఇటీవలి కాలంలో నెలకొన్న పరిస్థితులు తాండూరులో శాంతిభద్రతలను ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాలతో పోలిస్తే ఇక్కడి పరిస్థితులు కొంత విభిన్నం. రాష్ట్ర సరిహద్దులో ఉండటంతో పాటు సామాజిక వర్గాలు, స్థానిక రాజకీయాల నేపథ్యంలో ఇక్కడ లా అండ్ ఆర్డర్ మెయింటెనెన్స్ కత్తిమీద సాము వంటిదే. ఈ అంశంలో సమానత్వాన్ని పాటించాల్సిన కొంతమంది పోలీసు అధికారులు అనుసరిస్తున్న ఏకపక్ష తీరు.. ఆశాఖపై విమర్శలకు తావిస్తోంది.

తాండూరు సబ్ డివిజన్‌లో శాంతిభద్రతలు ప్రశ్నార్థకం

- పోలీసు అధికారుల పనితీరుపై విమర్శలు
- అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారని ప్రతిపక్షాల ఆరోపణ
- రాజకీయ కక్ష సాధింపులకు వారధిగా వ్యవహరిస్తున్నారని మండిపాటు
- అక్రమ కేసులు బనాయిస్తున్నారని బీఆర్ఎస్ నేతల ధ్వజం
- డీఎస్పీ, సీఐలపై హోం మంత్రికి ఫిర్యాదు



హోం మంత్రి మహమూద్‌అలీకి ఫిర్యాదు చేస్తున్న చైర్‌పర్సన్ స్వప్న, కౌన్సిలర్లు, నాయకులు

తాండూరు: తాండూరు సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతలు లోపించాయనే విమర్శలు చెలరేగాయి. ఇటీవల జరిగిన పలు సంఘటనలు ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన పలువురు పోలీసులు అధికార పార్టీ నేతలకు అనుకూలంగా పనిచేస్తున్నారనే ఆరోపణలు చెలరేగాయి. మున్సిపాలిటీతో పాటు పెద్దేముల్, యాలాల మండలాల్లో పోలీసు అధికారుల వైఫల్యం కారణంగా ఘర్షణలు చోటు చేసుకోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో తాండూరు సబ్ డివిజన్ పోలీసు అధికారుల పనితీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డీఎస్పీతో పాటు ఇద్దరు సీఐలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నేతలు హోం మంత్రి మహమూద్‌అలీకి ఫిర్యాదు చేశారు. తాండూరు సబ్ డివిజన్ పరిధిలో పనిచేసే పోలీసు అధికారులపై గతంలో ప్రజలు, నాయకుల్లో మంచి గౌరవం ఉండేది. ప్రస్తుతం సీన్ మారింది. స్థానిక ఎమ్మెల్యేల సిఫారసు మేరకు పోస్టింగ్‌లు వేయించుకున్న కొంతమంది పోలీసు అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారే ఆరోపణలు చెలరేగాయి. ఓ వర్గం నాయకులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు బనాయిస్తున్నారని బహిరంగ విమర్శలు చేస్తున్నారు. గత నెల యాలాల మండలంలో శివస్వామిపై దాడి జరిగినా పోలీసు అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారంటూ శివస్వాములు లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాపై ధర్నా చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. ఈ వ్యవహారంలో ఓ బీజేపీ నేతను టార్గెట్ చేసుకుని స్వాములతో పాటు సదరు నాయకుడిని సైతం జైలుకు పంపించారని మండిపడుతున్నారు. మిగిలిన ప్రతిపక్షాలు సైతం ఇదే వాదనను వినిపిస్తున్నాయి.

పోలీసుల వైఫల్యంతోనే దాడి

శివస్వాములను అల్లర్లకు ప్రేరేపించారనే ఆరోపణలపై బీజేపీ నాయకుడు మురళీకృష్ణగౌడ్‌ను అరెస్టు చేసిన పోలీసులు అతన్ని జైలుకు పంపించారు. పదిహేను రోజుల పాటు పరిగి జైలులో ఉన్న ఆయన బెయిల్‌పై వచ్చిన రోజు మీడియా సమావేశం ఏర్పాటు చేసి తనకు జరిగిన అన్యాయాన్ని వెల్లడించారు. దీన్ని జీర్ణించుకోలేని ఎమ్మెల్యే అనుచరులు అర్ధరాత్రి వేళ పెద్ద సంఖ్యలో వెళ్లి ఆయన ఇంటిపై దాడి చేశారు. ఫర్నిచర్ ధ్వంసం చేయడంతో పాటు కుటుంబ సభ్యులపై దాడి చేసి గాయపర్చారు. ఈ సమయంలో అక్కడే ఉన్న పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని బాధితులు ఆరోపించారు. ఇంత జరిగినా ఎమ్మెల్యే అనుచరులపై కేసు నమోదు చేయకపోవడం తాండూరు పోలీసుల పనితీరుకు నిదర్శనంగా మారింది.

చైర్‌పర్సన్‌పై కేసు

ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి వర్గంలో కొనసాగుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపై ఎమ్మెల్యేతో పాటు ఆయన వర్గీయులు చాలా కాలంగా గుర్రుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో పోలీసులను అడ్డం పెట్టుకుని ఆమెపై కేసులు నమోదు చేయించారనే ఆరోపణలున్నాయి. ఈ నెల 19న జరిగిన శివాజీ జయంతి వేడుకల్లో ప్రసంగిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, హిందూ ఉత్సవ కమిటీ చైర్‌పర్సన్ స్వప్న చేతిలో నుంచి డీఎస్పీ శేఖర్‌గౌడ్ మైక్ లాగేసుకున్నారు. ఓ మహిళ, స్థానిక ప్రజాప్రతినిధి, పట్టణ ప్రథమ పౌరురాలు అనే కనీస గౌరవం కూడా డీఎస్పీ స్థాయి అధికారి ఇలా వ్యవహరించడం అందరినీ ఆగ్రహానికి గురిచేసింది. అంతటితో ఆగకుండా చైర్‌పర్సన్‌తో పాటు మున్సిపల్ కౌన్సిలర్‌పై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయడం రాజకీయ కుట్రను బహిర్గతం చేసింది.

హోం మంత్రికి ఫిర్యాదు

కక్షపూరితంగా వ్యవహరించడంతో పాటు తమపై తప్పుడు కేసులు బనాయించిన తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ చైర్‌పర్సన్ స్వప్న, కౌన్సిలర్లు గురువారం హోం మంత్రి మహమూద్‌అలీని కలిసి వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులుగా కొనసాగుతున్న తమపై ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, పోలీసులు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తనను అగౌరవపర్చిన డీఎస్పీపై వెంటనే చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ కోరారు. మంత్రిని కలిసిన వారిలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ బొబ్బిలి శోభారాణి, కౌన్సిలర్లు నీరజాబాల్‌రెడ్డి, రామకృష్ణ, బోయ రవి, మాజీ కౌన్సిలర్ పట్లోళ్ల నర్సింహులు, బీఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, పరిమళ్‌గుప్తా, మసూద్ ఉన్నారు.

“ మైక్ లాక్కున్నారు..



హిందు ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శివాజీ జయంతి ఉత్సవాలు ఆరోజు మధ్యాహ్నం నుంచి ప్రశాంతంగా జరుగుతూ వచ్చాయి. పోలీసు అధికారులు సైతం అన్ని విధాలా సహకరించారు. శోభాయాత్ర తర్వాత శివాజీ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్ద అన్ని రాజకీయ పార్టీలకు, మత పెద్దలకు ప్రసంగించే అవకాశం కల్పించాం. గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్ రాజకీయ ప్రసంగం చేయడంతో బీజేపీ నాయకులు అడ్డుకున్నారు. హిందు ఉత్సవ సమితి అధ్యక్షురాలు స్వప్నపరిమళ్ ప్రసంగిస్తుండగా డీఎస్పీ వేదికపైకి వచ్చి మైక్ లాగేసుకొన్నారు. అవమానంగా భావించిన చైర్‌పర్సన్ పోలీసులు డౌన్‌డౌన్ అని నినాదాలు చేశారు.

– పట్లోళ్ల నర్సింహులు, ప్రధాన కార్యదర్శి, హిందు ఉత్సవ సమితి, తాండూరు

శాంతిభద్రతల కోసమే..



శివాజీ జయంతి వేడుకల్లో మధ్యాహ్నం నుంచి రాత్రి 9 గంటల వరకు శాంతి భద్రతలను పర్యవేక్షించాం. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఎలాంటి సమస్య తలెత్తలేదు. అయితే రాజకీయ ప్రసంగం చేసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజు గౌడ్ ప్రసంగాన్ని కొంతమంది అడ్డుకున్నారు. ఆతర్వాత శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రసంగించరాదని కోరడం జరిగింది. వందల మంది సమక్షంలో పోలీసు శాఖ డౌన్ డౌన్ అనడం వల్ల కేసు నమోదు చేశాం. మేము నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాం. అయితే చైర్‌పర్సన్ హోం మంత్రికి ఎందుకు ఫిర్యాదు చేశారనేది తెలియదు.

– శేఖర్‌గౌడ్, డీఎస్పీ, తాండూరు

బాల్య వివాహాలు నేరం

వికారాబాద్ అర్బన్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వీటిని ప్రోత్సహించే వారిపై సైతం చర్యలు తీసుకుంటామని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి లలిత కుమారి ఒక ప్రకటనలో హెచ్చరించారు. సమాజంలో బాల్య వివాహం అనేది ఒక పెద్ద సమస్యగా మారిందని పేర్కొన్నారు. వీటిని నివారించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గతేడాది జిల్లా వ్యాప్తంగా 228 బాల్య వివాహాలను అడ్డుకున్నామని ప్రకటించారు. బాలికల పట్ల అనుచితంగా ప్రవర్తించినా, అఘాయిత్యాలకు పాల్పడినా జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆపదలో ఉన్న పిల్లలను కనిపిస్తే 1098 లేదా 100 డయల్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కుల్కచర్ల: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ గిరి అన్నారు. కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ గ్రామ పరిధిలో బుధవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ఎదురుపడింది. వాహనాన్ని ఆపి అనుమతులపై ఆరా తీయగా.. అక్రమంగా తరలిస్తున్నట్లు తేలడంతో ట్రాక్టర్ సీజ్ చేశారు. డ్రైవర్ వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్

మెరుగైన విద్యనందించాలి

- టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి
- ఎఫ్ఎల్ఎన్ కమిటీ సభ్యుడు విశ్వనాథం గుప్తా



మేకవనంపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న విశ్వనాథంగుప్త

మోమిన్‌పేట: విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయుల సమష్టి కృషి అవసరమని మౌలిక భాష గణిత అభ్యసన సామర్థ్యాల సాధన (ఎఫ్ఎల్ఎన్) రాష్ట్ర స్థాయి పరిశీలన బృందం సభ్యుడు విశ్వనాథం గుప్తా అన్నారు. మండల పరిధిలోని పలు ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంలో ఉపాధ్యాయుల సమష్టి కృషి ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిని కూడా మెరుగుపర్చాలని సూచించారు. పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ప్రతిఒక్కరికీ భాష, గణితంలో పూర్తిగా ఆకలింపు చేసుకొనేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పర్యటనలో రాష్ట్ర స్థాయి బృందం సభ్యులు లతామాధవి, సంతోష్ రాజ్, షాహిద్‌అలీ, జిల్లా ఏఎంఓ రవి, ఎంఈఓ గోపాల్, మండల నోడల్ అధికారి మల్లేశం, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడుతాం

- అధికార బలంతో అడ్డుకునే కుట్ర తగదు
- వైఎస్సార్ టీపీ పరిగి కో ఆర్డినేటర్ యాదయ్య
- హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని మండిపాటు



పరిగి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ టీపీ నాయకులు

పరిగి: వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఎల్లప్పుడూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ కోళ్ల యాదయ్య అన్నారు. ఈ మేరకు గురువారం పరిగిలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టారు. కానీ స్థానిక పోలీసులు పట్టణంలోనే వీరిని అడ్డుకున్నారు. దీంతో పరిగి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. అధికార పార్టీ నాయకులు ప్రజాపోరాటాన్ని అణచివేసే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగానే తమ పార్టీ నేతలను అరెస్టు చేయడంతో పాటు నిర్బంధాలకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలోని ప్రజలు, రైతులు పడుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు పాదయాత్ర చేపట్టామని తెలిపారు. ధరణి సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పేదలకు ఇచ్చిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల హామీని నెరవేర్చలేదని తెలిపారు. రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా ఇస్తున్నామని చెబుతున్నా ఎక్కడా అమలు కావడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అనేక కష్టనష్టాలకు ఓర్చి రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. గత ఎన్నికలకు ముందు లక్ష రూపాయల వరకు ఉన్న పంట రుణాలు మాఫీ చేస్తామని చెప్పినా.. ఇప్పటి వరకూ వర్తించలేదన్నారు. రైతు ఆత్మహత్యలు, నిరుద్యోగ సమస్య రోజురోజుకూ ఎక్కువవుతోందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తాము ఎల్లప్పుడు పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ టీపీ నాయకులు పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలిన పీఆర్టీయూ నేతలు



హైదరాబాద్ వెళ్లిన ఉపాధ్యాయ సంఘం నాయకులు

యాలాల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా పీఆర్టీయూ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి నామినేషన్ కార్యక్రమానికి యాలాల మండలం నుంచి పీఆర్‌టీయూ నాయకులు గురువారం భారీగా తరలివెళ్లారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, యాదయ్యగౌడ్, మొగులయ్య, శ్రీనివాస్, నర్సిరెడ్డి తదితరులు నామినేషన్‌కు తరలివెళ్లారు. అనంతరం అక్కడ జరిగిన భారీ ర్యాలీలో పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



ప్రశాంత్(ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: ఇంటర్‌నెట్ కేబుల్ సరి చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం ఇబ్రహీంపట్నంలోని మహంకాలమ్మ ఆలయం సమీపంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. చింతపల్లిగూడకు చెందిన జోగు ప్రశాంత్ కొంత కాలంగా ఇంటర్‌నెట్ కేబుల్ బ్రాడ్ బ్యాండ్ కనెక్షన్లు ఇస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే గురువారం ఇబ్రహీంపట్నంలోని మహంకాళి ఆలయం సమీపంలో ఇంటర్‌నెట్ వైర్లు సరి చేసేందుకు విద్యుత్ స్తంభం ఎక్కాడు. ప్రమాదవశాత్తు షాక్ తగలడంతో స్తంభం పైనుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

చెరువులో పడి మహిళ మృతి



మృతి చెందిన శాంత

మీర్‌పేట: మతిస్థిమితం లేని మహిళ చెరువులో పడి మృతి చెందిన సంఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఉదయ్‌భాస్కర్ కథనం ప్రకారం.. భూపేష్‌గుప్తా నగర్‌కు చెందిన శాంత(45) వృత్తి బట్టల వ్యాపారం. గురువారం సాయంత్రం శాంత జిల్లెలగూడ చందన చెరువులో పడి మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్యకర్తలను ఇబ్బంది పెట్టొద్దు



ఆత్మీయ సమ్మేళనంలో మనోహర్‌రెడ్డి

డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి

పరిగి: తన వెంట తిరిగే కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి హెచ్చరించారు. పట్టణ కేంద్రానికి చెందిన ఎండీ షోయబ్ తన అనుచరులతో కలసి క్యూవైఏ గార్డెన్‌లో గురువారం బీఎంఆర్‌తో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండటంతో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించడం లేదన్నారు. కోడ్ ముగిసిన తర్వాత సీఎం కేసీఆర్, మంత్రి సబితారెడ్డి సమక్షంలో పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరికలు ఉంటాయని తెలిపారు. తనవెంట తిరిగే కార్యకర్తలను, తనకు మద్దతు ప్రకటించే నాయకులను కొంతమంది ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఇది సరైన పద్ధతి కాదని హితవు పలికారు. తాను ఎల్లప్పుడు కార్యకర్తలకు అండగా నిలుస్తానని, నమ్ముకున్న వారికి న్యాయం చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌వర్ధన్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, యాదయ్య, రాంరెడ్డి, షోయబ్ మద్దతుదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగాత్మక విద్యకే పెద్దపీట



అంతర్జాతీయ సదస్సులో మాట్లాడుతున్న జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి

- జేఎన్‌టీయూ వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి
- శ్రీదత్త కళాశాలలో అంతర్జాతీయ సదస్సు
- అధునాతన కంప్యూటర్ ప్రయోగశాల ప్రారంభం

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రయోగాత్మక విద్యనందించడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత మెరుగుపడుతుందని, ఇలాంటి చదువులకే పెద్దపీట వేయాలని జేఎన్‌టీయూ హైదరాబాద్ యూనివర్సిటీ వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని శేరిగూడ శ్రీదత్త ఇంజనీరింగ్ కళాశాలలో నూతన ఆవిష్కరణలపై 2వ అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పరిశోధనలకు ఉపయోగపడే చదువులకే ప్రాధాన్యత ఉందన్నారు. ప్రపంచ దేశాల్లో ప్రయోగాత్మకమైన విద్యనందించడంలో మన దేశం 49వ స్థానంలో ఉందన్నారు. దాన్ని టాప్ 10లోకి తీసుకురావడానికి అన్ని ఇంజనీరింగ్ కళాశాలలు కృషి చేయాలని సూచించారు. రోజురోజుకూ ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్‌కు ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. అతి తక్కువ కాలంలో శ్రీదత్త కళాశాల యుజీసీ నుంచి అటానమస్ హోదా సాధించడం గర్వకారమన్నారు. కళాశాలలో వసతులు, విద్యాబోధనపై చైర్మన్ పాండురంగారెడ్డిని అభినందించారు . అనంతరం లండన్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ పరీన్ సోమని మాట్లాడారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఉన్నత చదువులు చదవాలన్నారు. దేశానికి ఉపయోగపడే చదువులు ఉండాలన్నారు. ఉపాధి అవకాశాల కోసం చూడకుండా పది మందికి ఉపాధి కల్పించేలా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ వైభవ్‌రెడ్డి, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ చక్రవర్తి, సీఈఓ ప్రశాంత్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రావు, డాక్టర్ సెందిల్ కుమార్, శ్రీనివాస్, డాక్టర్ వెంకట అమృతరావు, యశ్వంత్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన తప్పనిసరి

- అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ జాతీయ ఉపాధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పురుషోత్తంరెడ్డి

షాద్‌నగర్ రూరల్: భారత రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ జాతీయ ఉపాధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ శివారులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. హక్కుల సాధనకు కలిసి కట్టుగా కృషి చేయాలని కోరారు. సైబర్ నేరగాళ్లు సెల్ ఫోన్లలో యాప్‌లను తయారు చేసుకొని రుణాల పేరిట మోసం చేస్తున్నారని తెలిపారు. లోన్‌యాప్ ద్వారా ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం పట్టణానికి చెందిన న్యాయవాది రాందాస్‌ను అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర న్యాయ సలహాదారులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో కమిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, న్యాయవాదులు గంతలశివయ్య, వేణుగోపాల్, బెన్నూరి చంద్రయ్య, గంతల నాగరాజు, రాజశేఖర్‌రాజు, శ్రీనివాస్, రామస్వామి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.